జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

ఖలీల్‌వాడి, జనవరి 15 : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్‌గా పీడియాట్రిక్ విభాగానికి డాక్టర్ శ్రీనివాస్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌పై దవాఖానలో బర్త్‌డే వేడుకలు నిర్వహించడంపై విమర్శలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆమెపై వేటు వేసిన విషయం తెలిసిందే. దీంతో శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించగా.. ఆయన ఆయన బాధ్యతలు స్వీకరించారు.

బస్తీ దవాఖానల్లో నాణ్యమైన సేవలందించాలి

మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

ఖలీల్‌వాడి, జనవరి 15 : నగరంలోని ఖానాపూర్, నాగారం బస్తీ దవాఖానలను జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి బి.రాజశ్రీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాధినిరోధక టీకాల పంపిణీ, ఇతర వైద్య సేవలను పరిశీలించారు. ప్రతి ఆశ కార్యకర్త డ్యూలిస్ట్‌ను మెయింటైన్ చేయాలని ఆదేశించారు. ఒకరోజుముందే టీకాలు ఎవరికి ఇవ్వాలో వివరాలను సిద్ధం చేసి, వారిని బస్తీ దవాఖానలకు వచ్చేలా చూడాలని అన్నారు. క్షేత్రస్థాయిలో గృహ సందర్శన చేసి వ్యాధిగ్రస్తులకు బస్తీ దవాఖానకు తరలించేలా చూడాలన్నారు. ఆమె వెంట వైద్యాధికారులు, ఏఎన్ఎంలు ఉన్నారు.

ఇండస్ట్రియల్ ఏరియాలో అగ్నిప్రమాదం

వినాయక్‌నగర్, జనవరి 15 : నిజామాబాద్ నగర శివారులోని సారంగాపూర్ గ్రామ పరిధిలో బుధవారం మధ్నాహ్నం స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. ఇండస్ట్రియల్ ఏరియాలో ఓ వ్యాపారుడు తన షాపునకు సంబంధించిన వేస్టేజ్‌కు నిప్పంటించాడు. మంటలు చుట్టుపక్కల ఉన్న ఇతర చెత్తకు అంటుకొని వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారంసమాచారం అందించగా.. వారితోపాటు ఆటోటౌన్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

వ్యక్తి అదృశ్యం

చవాన్ పీరాజీ

వినాయక్‌నగర్, జనవరి 15 : నిజామాబాద్ నగరంలోని దుబ్బ, ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన చవాన్ పీరాజీ (47) రెండు రోజులుగా కనిపించడం లేదని కుటుంబసభ్యులు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఇంట్లో నుంచి బయటికి వెళ్లి అతడు తిరిగి రాలేదని, ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 89195 88199, 63025 02729 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

వృద్ధురాలు..

లక్ష్మి

ముప్కాల్, జనవరి 15: మండలంలోని నాగంపేట్ గ్రామానికి చెందిన పాకనాటి లక్ష్మి(67) అదృశ్యమైంది. ఎస్సై రజనీకాంత్ కథనం మేరకు.. లక్ష్మి నెల రోజుల క్రితం కంటి ఆపరేషన్ చేయించుకుంది. అప్పటి నుంచి ఆమె మానసిక స్థితి బాగాలేదు. ఈనెల12న ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల, బంధువు ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. వృద్ధురాలి కొడుకు పాకనటి రాజు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భీమ్‌గల్ సీఐ బదిలీ

భీమ్‌గల్, జనవరి 15: ఇటీవల పలు కేసుల్లో ఆరోపణలు రావడంతో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌పై ఉన్నతాధికారులు బదిలీ వేటు వేశారు. భీమ్‌గల్‌కు చెందిన ఒక కేసులో తన లొకేషన్‌ను సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ట్రేస్ చేసి ఇతరులకు ఇవ్వడంతో తనపై దాడి జరిగిందని ఒకరు ఇటీవల పోలీసులపై ఆరోపణలు చేశారు. ఏసీపీ విచారణలో బాధితులుడు ఫిర్యాదు చేశాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐని జిల్లా హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. సీఐపై వచ్చిన ఆరోపణలపై అధికారులు విచారణ జనపుతున్నారు.

నేటి నుంచి సాగుకు యోగ్యం కాని భూముల సర్వే

మోర్తాడ్/ఏర్గట్ల, జనవరి 15: సాగుకు యోగ్యం కాని భూముల సర్వేను మండలంలో గురువారం నుంచి చేపట్టనున్నట్లు మండల వ్యవసాయాధికారి హరీశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు టీంలుగా ఏర్పడి సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈసర్వే అధికారులకు రైతుల సహకరించాలని కోరారు. గురువారం దొన్కల్, వడ్యాట్, మోర్తాడ్, పాలెం గ్రామాల్లో, శుక్రవారం ధర్మోరా, దోన్‌పాల్, మోర్తాడ్, శెట్‌పల్లి గ్రామాల్లో, శనివారం తిమ్మాపూర్, సుంకెట్ గ్రామాల్లో సర్వే కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఏర్గట్ల మండలంలోని ఎనిమిది గ్రామాల్లో గురువారం నుంచి వ్యవసాయానికి యోగ్యం కాని భూముల సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీలత, మండల వ్యవసాయాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మండలంలోని గుమ్మిర్యాల్, తాళ్లరాంపూర్‌లో, ఈ నెల 17న దోంచంద, తొర్తి గ్రామాల్లో, 18న ఏర్గట్ల, తడ్‌పాకల్ గ్రామాల్లో, 20న బట్టాపూర్ గ్రామాల్లో ఈ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు గ్రామల్లోనే ఉండి సర్వేకు సహకరించాలని అధికారులు సూచించారు.

21 నుంచి గ్రామసభలు

ముప్కాల్, జనవరి 15: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీపై అధికారులకు మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీవో నరేశ్ ఆనంద్ మాట్లాడుతూ లబ్ధిదారులను గుర్తించేందుకు ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి స్రవంతి, తహసీల్దార్ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ పి.శ్రీకాంత్, మండల పంచాయతీ అధికారి గౌస్ మొహినుద్దీన్, మండల వ్యవసాయ అధికారి సాయికృష్ణ, ఏపీవో ప్రసాద్‌రావు, ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు మల్లేశ్ యాదవ్, గౌతమి, హన్మాండ్లు, నరేశ్, రాజు, విజ్ఞేశ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

బోధన్ రూరల్,డిసెంబర్ 15: బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో మంగళవారం షార్ట్ సర్క్యూట్‌తో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైంది. స్థానికులు, విద్యుత్ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఎస్ఎస్ ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం కావడంతో స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్, వైర్లు కాలిపోయినట్లు విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదికను పంపించారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా సంపత్

డిచ్‌పల్లి, జనవరి 15 : ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా ముల్లంగి గ్రామానికి చెందిన సంపత్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ మంగళవారం నియామకపత్రాన్ని విడుదల చేశారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

చందూర్‌లో పశువులతో కనుమ పండుగను జరుపుతున్న రైతులు

విజేతలకు బహుమతులు అందజేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి దీప్తి

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 15 : జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సంబురాలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు వేకువజామునే నిద్రలేని, వాకిళ్లపై కల్లాపి చల్లి రంగు రంగుల ముగ్గులు వేశారు. ఇండ్ల ముందు హరిదాసుల గానాలు, గంగిరెద్దుల ప్రదర్శనలు, ఇండ్లల్లో పిండి వంటలు, యువకుల పతంగుల హోరుతో గ్రామాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. ఉద్యోగాల రీత్యా వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారు పండుగ సెలవుల్లో స్వగ్రామాలకు రావడంతో ఇండ్లన్నీ కళకళలాడాయి. గ్రామాల్లో మహిళలు నోములు నోచి, వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. రైతులు పశువులను అలంకరించి, పూజలు చేశారు. పలు ప్రాంతాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివవెళ్లారు. కోటగిరి మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి రోజున ఉదయం రైతులు జొన్న, శనగ చేన్లలోకి వెళ్లి లక్ష్మీదేవీకి పూజలు చేశారు. ఆర్మూర్ మండలంలోని ఇస్సాపల్లిలో ఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జూనియర్ సివిల్ జడ్జి దీప్తి హాజరై విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ధర్పల్లి మండలంకేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు శ్రీ లక్ష్మీనర్సింహా స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి మహిళలకు గాజులు అందజేశారు. సంక్రాంతి సందర్భంగా పొతంగల్ మండలంలోని హంగర్గా వద్ద ఉన్న మంజీరా నదిలో గంగమ్మతల్లి పండుగను గ్రామస్తులు నిర్వహించారు. శ్రీ చైతన్య మహరాజ్ హాజరై భక్తులకు ప్రవచనాలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల, బోధన్, రెంజల్ మండలాల్లో సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు.

లబ్ధిదారుల గుర్తింపు కోసం పకడ్బందీ సర్వే

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, జనవరి 15 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలుచేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి లబ్ధిదారుల గుర్తింపు కోసం క్షేత్రస్థాయిలో పకడ్బందీ సర్వే చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. గ్రామసభలు నిర్వహించి, లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని అన్నారు. అదనపు కలెక్టర్లు, మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీ అధికారులు, వ్యవసాయాధికారులు, పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖల అధికారులతో సంక్షేమ పథకాల అమలుపై బుధవారం కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. లబ్ధిదారుల జాబితాను రూపొందించడంలో అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి జాబితాను రూపొందించాలని ఆదేశించారు. 21 నుంచి చేపట్టనున్న గ్రామసభల్లో జాబితాను ప్రవేశపెట్టి, ఆమోదం పొందిన తర్వాత అర్హుల జాబితాను కలెక్టర్ కార్యాలయంలో అందించాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా నిబద్ధతతో క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

- 40 వాహనాలు సీజ్, కేసులు నమోదు

వాహనాల తనిఖీలో పాల్గొన్న పోలీసులు

వినాయక్‌నగర్, జనవరి 15 : జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆర్టీసి బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ చేట్టారు. నంబర్ ప్లేట్ లేని 30 వాహనాలతో పాటు మరో శబ్ద కాలుష్యం చేసే సైలెన్సర్లు కలిగి ఉన్న 10 బైక్‌లను సీజ్ చేశారు. తనిఖీల్లో ఎస్సై చంద్రమోహన్, రహమతుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

డిచ్‌పల్లి/ ధర్పల్లి, జనవరి 15 : రాష్ట్రప్రభుత్వం ఈనెల 26 నుంచి నిర్వహించనున్న నాలుగు పథకాలకు సంబంధించిన చేపట్టే సర్వేకు ప్రజలు సహకరించాలని ఇందల్వాయి, ధర్పల్లి తహసీల్దార్లు వెంకట్‌రావు, మాలతి కోరారు. ఆయా తహసీల్ కార్యాలయాల్లో వ్యవసాయ, రెవెన్యూ శాఖ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. సర్వే కోసం బృందాలను ఏర్పాటు చేశామని, 16 నుంచి 19వ తేదీ వరకు వ్యవసాయానికి యోగ్యం కానీ భూములను గుర్తించనున్నట్లు తెలిపారు.

ఇందల్వాయి బస్టాండ్ తనిఖీ

డిచ్‌పల్లి, జనవరి 15 : ఇందల్వాయి ఆర్టీసీ బస్టాండ్‌ను ఆర్టీసీ ఆర్ఎం జోత్స్న.. డీఎం సచ్చిదానందతో కలిసి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. బస్టాంట్ ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని, ఖాళీగా ఉన్న షాపులను భర్తీ చేయాలని సిబ్బంది, కంట్రోలర్ గంగదాస్‌కు సూచించారు. బస్టాండ్ శుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయిలో బస్టాండ్‌ల స్థితిగతులు, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం బస్టాండ్ చుట్టూ ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లను పరిశీలించారు. బస్టాండ్‌లోని ఖాళీ స్థలాలను అద్దెకు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆమె వెంట డీఎం డిప్యూటీ ఆర్ఎం సరస్వతి, ఇందల్వాయి బస్టాండ్ కంట్రోలర్ గంగదాస్ తదితరులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిరికొండ / రుద్రూర్, జనవరి 15 : సిరికొండ శివారులోని బొడ్డు మామిడి చెరువు సమీపంలో పేకాట స్థావరంపై ఎస్సై రామ్ మంగళవారం దాడులు నిర్వహించారు. పేకాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 సెల్‌ఫోన్లు, రూ.12,300 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రుద్రూర్ మండలకేంద్రంలో బుధవారం పేకాటస్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని, రూ.5,800 స్వాధీనం చేసుకున్నట్లు చేసినట్లు ఎస్సై సాయన్న వెల్లడించారు.

యువత సమాజ మార్పు కోసం కృషిచేయాలి

- ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

సిరికొండ, జనవరి 15 : యువత క్రీడల్లో పాలుపంచుకోడంతోపాటు సమాజ మార్పు కోసం కృషి చేయాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు గుమ్మడి నర్సయ్య అన్నారు. మండలంలోని గడ్కోల్‌లో సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి ఆర్.రమేశ్ అధ్యక్షతన గడ్కోల్ అమరవీరుల స్మారకార్థం జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి, గ్రామంలో ఎర్రజెండాను ఎగురవేశారు. భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పించి, గ్రామంలో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, రామకృష్ణ, దేవారాం, గోదావరి, దామోదర్, బాబన్న, లింబన్న, రాంజీ, కిశోర్, సాయారెడ్డి, రమేశ్, నారాగౌడ్, రమ, పుష్పలత, కిశోర్, బాల్‌రెడ్డి, గంగామణి, అనీస్, ఎర్రన్న, ఆశిస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కార్యక్రమంలో పాల్గొన్న 2009-10 ఎస్సెసీ బ్యాచ్ విద్యార్థులు

ఖలీల్‌వాడి, జనవరి 15 : నగరంలోని సరస్వతీ విద్యానికేతన్‌లో చదివిన 2009-10 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఓ ప్రైవేట్ హోటల్‌లో మంగళవారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులంతా ఒకే వేదికపై కలుసుకొని, రోజంతా సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు భిక్షపతి, వెంకటేశ్వర్లు, గంగాధర్, సురేశ్, నాగేశ్, ప్రియాంక, అపర్ణ, రాము, యోగేశ్, శివ, రాజు, ప్రవీణ్, భరత్, భాగన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **నేటి నుంచి ఇంటింటి సర్వే -** చందూర్, జనవరి 15 : మండల కేంద్రంలో నేటి నుంచి రైతుభరోసా, రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇండ్ల వద్దకు వెళ్లి సర్వే చేపట్టనున్నట్లు తహసీల్దార్ మాలతి, ఎంపీడీవో నీలావతి బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని తెలిపారు.
- **సర్వే వివరాల పరిశీలన -** పొతంగల్, జనవరి 15 : ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేపట్టిన వివరాలను ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి బుధవారం పరిశీలించారు. సూపర్ చెక్ కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో బుధవారం పర్యటించి, సిబ్బంది చేపట్టిన సర్వే వివరాలపై ఆరా తీశారు. యాప్‌లో వివరాల నమోదు సరిగ్గా చేశారా, యాప్‌లో నమోదు చేసిన వివరాల ప్రకారం అర్హుల ఇండ్లను పరిశీలించారు.
- **పోస్టర్ల ఆవిష్కరణ -** ధర్పల్లి, జనవరి 15 : కొత్తగూడెంలో ఐఎఫ్‌టీయూ విలీన సభను ఈనెల 18న నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి పద్మ తెలిపారు. మండల కేంద్రంలో బీడీ కార్మికులతో కలిసి ఇందుకు సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సునీత, రూప, గంగోత్రి పాల్గొన్నారు

అంతర్ జిల్లా నేరస్తుడి అరెస్ట్ : 9 బైకులు స్వాధీనం

వినాయక్‌నగర్, జనవరి 15 : జిల్లాకేంద్రంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలు, హైదరాబాద్‌లో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిజామాబాద్ వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరిల ప్రకారం.. నగరంలోని శాంతినగర్‌కు చెందిన షేక్ ఆదిల్ గతంలో చోరీలు చేసి జైలుకు వెళ్లి వచ్చాడు. జైలు నుంచి బయటికి వచ్చిన తరాత కూడా తన బుద్ధి మార్చుకోకుండా హైదరాబాద్‌తో పాటు నిజామాబాద్, బోధన్, నవీపేట్ తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డాడు. బుధవారం వన్‌టౌన్ పోలీసులు నిందితుడికి అదుపులోకి తీసుకుని విచారించగా ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు అంగీకరించాడు. షేక్ ఆదిల్ నుంచి 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చారు. నిందితుడి పట్టుకునేందుకు కృషి చేసిన సిబ్బందిని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి అభినందించారు.

దొంగ అరెస్ట్, బైక్ రికవరీ

జక్రాన్‌పల్లి, జనవరి 15 : వాహనాల తనిఖీలో బైక్ చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామపరిధిలో ఉన్న గాంధీనగర్‌లో రాయికంటి గంగాధర్‌కు చెందిన బైక్ నవంబర్ 1న చోరీకి గురికాగా.. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు. బుధవారం వాహనాల తనిఖీ చేపడుతుండగా.. అనుమానాస్పదంగా కనిపించిన కామారెడ్డి జిల్లా దోమకొండకు చెందిన పల్లపు రమేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. తాను బైక్ చోరీ చేసిన ఒప్పుకున్నట్లు తెలిపారు. బైక్‌ను రికవరీ చేసి, నిందితుడికి కోర్టులో హాజరుపర్చి, రిమాండ్‌కు తరలించామని ఎస్సై తిరుపతి తెలిపారు.

నెల రోజుల సెలవులో ఎడపల్లి ఎస్సై

ఎడపల్లి, జనవరి 15: స్థానిక ఎస్సై వంశీకృష్ణారెడ్డి అనారోగ్యం కారణంతో నెల రోజుల సెలవులో వెళ్లినట్లు ఏఎస్సై ఇలియాస్ బుధవారం తెలిపారు. మూడు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విధులకు హాజరు కాలేదు. ఉన్నతాధికారులకు సెలవు సమాచారం అందించినట్లు తెలిసింది.

చైనా మాంజా తెగి ఇద్దరికి గాయాలు

దవాఖానలో చికిత్స పొందుతున్న ప్రవీణ్

నవీపేటలో గాయపడిన ఆధ్నాన్

మోర్తాడ్/నవీపేట, జనవరి 15: సంక్రాంతి పండుగ రోజు చైనామాంజా తెగి మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గుజ్జేటి ప్రవీణ్(35) గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు వెంటనే యువకుడిని దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. ప్రవీణ్ కమ్మర్‌పల్లి నుంచి తిమ్మాపూర్ వెళ్తుండగా కమ్మర్‌పల్లి శివారులో చైనా మాంజా గొంతుకు తట్టుకుంది. కమ్మర్‌పల్లిలో ఇటువంటి ఘటన రెండోది. ఇప్పటికే చైనామాంజా అమ్ముతున్న వ్యక్తి యాదగిరిపై కేసు నమోదు చేశారు. సంక్రాంతి రోజు మరో ఘటన చోటు చేసుకోవడంతో పోలీసులు గ్రామంలో తిరుగుతూ గాలిపటాలు ఎగరవేసే వారి వద్ద ఉన్న దారాన్ని పరిశీలించారు. చైనా మాంజా విక్రయించినా, వాడినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నవీపేటలో..

నవీపేట మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఆధ్నాన్(18) అనే యువకుడు చైనా మాంజా కోసుకొని గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. స్థానికంగా ఓ వెల్డింగ్ షాపులో అధ్నాన్ పనిచేస్తున్నాడు. మంగళవారం ఉవదయం షాపునకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కొందరు యువకులు చైనా మాంజాతో గాలి పటాలను ఎగుర వేస్తున్నారు. అంతలోనే తెగిపోయిన గాలి పటం చైనా మాంజాతో బాసర రోడ్డుపై వచ్చి పడింది. అటుగ వెళ్తున్న సదరు యువకుడు ఆధ్నాన్ కాళ్లు, చేతులను చైన్ మంజా చుట్టుకుని మెడను కోసింది. కింద పడిపోయిన సదరు యువకుడిని స్థానికులు స్థానిక ప్రైవేటు దవాఖానకు తరలించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సూచనలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్

శక్కర్‌నగర్, జనవరి 15: బోధన్ పట్టణంలో ఆటోలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ హెచ్చరించారు. బుధవారం బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ఆటోల యజమానులు, డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా బస్టాండ్ ప్రాంతంలో ఆటోలు నడిపే వారు నిబంధనలు పాటించాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, సిబ్బంది, ఆటో డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్, జనవరి15: రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామని జిల్లా రవాణా శాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. రోడ్డు భద్రత మాసాత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్టీవో కార్యాలయం ఆవరణలో బుధవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలని, కారు నడుపేవారు సీటు బెల్టులను పెట్టుకోవాలన్నారు. మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే జరిమానాతోపాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట ఆర్మూర్ ఎంవీఐ వివేకానందరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలి

తహసీల్దార్ వెంకటరమణకు వినతి పత్రాన్ని అందజేస్తున్న స్థానికులు

నవీపేట, జనవరి15: మండల కేంద్రంలోని మాధవనగర్ వెంచర్‌లో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరుతూ బుధవారం స్థానికులు తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో నాగనాథ్, జీపీ కార్యదర్శి రవీందర్ నాయక్‌కు వినితి పత్రాలను అందజేశారు. రెండేండ్ల క్రితం వెలిసిన మాధవనగర్ వెంచర్‌లో అన్ని వర్గాల ప్రజలు ప్లాట్లను కొనుగోలు చేసి ఇండ్లను నిర్మించుకున్నారని అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కానీ ఒక వర్గానికి చెందిన వారు ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోకుండా ఇతర వర్గాల మనో భావాలను దెబ్బతీసే విధంగా అక్